
# ఎదురు తిరిగిన కథ




వెంకోబరావుని సాదరంగా ఆహ్వానించింది రాజామణి. అతను వెళ్ళేసరికి ఆమె సోఫాలో పడుకుని ఒక నవల చదువుతున్నది.

సోఫా ఎదురుగా కొంచెం దూరంలో ఉన్న కుర్చీలో కూర్చున్నాడు వెంకోబరావు.

"చాలా రోజులకు కనిపించావ్, రావ్! మరీ నీ దర్శనమే కరువయ్యింది" అన్నాదామె పమిటను సర్దుకుంటూ.

అతను చెప్పాడు– "బెంగుళూర్ వెళ్ళాను"

"ఎందుకు?"

"ఎందుకేమిటి మామూలే. ఇంటర్వ్యూకి వెళ్ళాను"

"బాగా ఆన్సర్ చేశావా?"

"శాటిస్‌ఫైడ్"

నవ్వింది రాజామణి. నవ్వుతూనే– "నీకేం నువ్వు రచయితవి. తెలివైన వాడివి. దూసుకు వెళ్ళగలవు. ఏ సబ్జెక్టులో అయినా" అన్నది.

"థాంక్స్".

"నో మెన్షన్" లేచి నిలబడింది. నవల సోఫా మీద పడ్డది.

లోపలకు వెళ్ళింది.

నవలను తీసుకున్నాడు వెంకోబరావు. పేజీలు తిప్పాడు.

అందులోంచి కింద పడింది ఒక ఉత్తరం.

కవరు మీద ఫ్రమ్ అడ్రసు చూశాడు. "సుందరి, వాల్తేరు" అని వుంది.

చదవకూడదనే అనుకున్నాడు వెంకోబరావు. కానీ, మనసు నిలవ లేదు. ఉత్తరాన్ని నవల్లో ఉంచాడు.

"రాజామణి!"

"ఏం చేస్తున్నావ్?"

"వచ్చావుగా అతిథి దేవుడివి. కాఫీ చేస్తున్నాను"

"థాంక్ యూ!"

రాజామణి వంట గదిలో నించి బయటకు రావటానికి కనీసం పది నిమిషాలు పడుతుంది.

ఉత్తరాన్ని విప్పాడు.

"నా ప్రియమైన రాజీ!

నేను కులాసా. నీ బద్ధకం తలుచుకుంటే ఒళ్ళు మండుకొస్తూంది. వాల్తేరు వచ్చిన తరవాత నేను రెండు ఉత్తరాలు రాశాను. నువ్వు ఒక్కదానికే జవాబు రాశావు. ఇప్పుడు మాకు మంచి ఇల్లు దొరికింది. నిన్ననే కొత్త ఇంట్లోకి వచ్చాము. రాజీ. కొత్త ఇల్లు ఎంత బాగున్నదో తెలుసా? బ్యూటీఫుల్‌గా వుంది. రకరకాల పువ్వుల మొక్కలు ఎన్నో ఉన్నాయి.

ఇంతకీ నువ్వెలా ఉన్నావ్? బాగా నవల్లు చదువుతున్నావా? నీకేం అదృష్ట వంతురాలివి. ఎన్ని నవలలయినా చదువుతావ్! గారాబాల పట్టివి. నేను ఇంట్లో పనిచెయ్యకపోతే మా అమ్మ అరుపులు నీకు తెలుసు కదా?

ఒసేవ్ రాజీ! అసలు విషయం రాయటం మరిచి పోయాను. మా రోడ్డులో నవలలు అద్దెకు ఇచ్చే ఒక షాపు ఉంది. ఆ షాపులో బుక్స్ ఇచ్చే ఒక కుర్రాడు ఉన్నాడు. చాకులాంటి కుర్రాడనుకో. హీరోలా ఉన్నాడు. నాకైతే చూడగానే మతి పోయింది. వీలయితే ఒక చూపు చూడాలి. ముద్దు వస్తున్నాడు. డిగ్రీ పాసయినాడట. ఉద్యోగం దొరక్క ఈ షాపు పెట్టాడట. ఈసారి ఉత్తరంలో అతని గురించి మరికొన్ని విశేషాలు రాస్తాను. నువ్వు మాత్రం ఈ ఉత్తరం చూడగానే లెటర్రాయి. రాయకపోతే నా మీద ఒట్టే. ఉండనా మరి.

నీ ప్రియమైన

సుందరి

ఆ ఉత్తరంలో చివరి లైన్లు చదివేసరికి వెంకోబరావుకి మతి పోయినట్లు అయింది. వాడెవడో ఆ బుక్ షాపు కుర్రాడు లక్కీ ఫెలో అనిపించింది. సుందరి అతనికి బాగా తెలుసు. సుందరి రాజామణి స్నేహితులు. రాజామణి వెంకోబరావుకు చాలా యేళ్ళ నుంచీ తెలుసు. ఆమె కుటుంబంతో కూడా అతనికి మంచి పరిచయమే ఉంది.

సుందరి అందం వెంకోబరావు కళ్ళముందు కదిలింది. అంత అందంగా ఉండే సుందరి ఆ బుక్‌షాప్ కుర్రాడిని ఒక చూపు చూడాలనుకుందంటే వాడు నిజంగా అదృష్టవంతుడు అనుకున్నాడు.

వెంకోబరావు ఎన్నో ప్రేమ కథలు రాశాడు. ఆ కథల్లో ఎన్నో ప్రేమ లేఖలు రాశాడు. కాని సుందరి రోజామణికి రాసిన ఆ ఉత్తరాన్ని చూడగానే అంతులేని ఆశ్చర్యం కలిగింది. అమ్మాయిలు ఇంత దారుణంగా కుర్రాళ్ళ గురించి రాసుకుంటారా?

ఆ ఉత్తరాన్ని నవల్లో ఉంచి దాన్ని సోఫా మీదకు విసిరాడు.

నిమిషం తరవాత కాఫీ కప్పులతో నచ్చింది రాజామణి.

"సారీ. నీకు బాగా బోర్ కొట్టినట్టుంది" కప్పును అందిస్తూ అన్నది.

"బోర్ లేదు. నవల అక్కడక్కడ చదివాను"

"బాబోయ్. అందులో ఒక ఉత్తరం ఉంది. కొంపదీసి ఆ ఉత్తరాన్ని చదవలేదు కదా" అన్నది.

"లేదులే... చదవలేదు. అయినా, అందులో ఏముంది?" నవ్వుతూ అడిగాడు.

"ఏం లేదులే"

"ఇంట్లో వాళ్ళంతా ఏమయ్యారు?"

"మ్యాట్నీకి వెళ్ళారు"

"నువ్వు వెళ్ళలేదే"

"నువ్వు వస్తావని" నవ్వింది.

"నిజంగా"

"నిజం బాబూ!"

"ఎందుకు నాకోసం ఎదురు చూడటం"

"రచయితవి కదూ... కథలు చెబుతావని"

"నేను రాసే వాడినే చెప్పటం చేతకాదు."

"నమ్మమంటావా?"

"వద్దులే. ఇలా నవలలు చదువుతూ కూర్చోకపోతే ఏదయినా ఉద్యోగం కోసం ప్రయత్నం చెయ్యరాదూ"

"నేను ఉద్యోగం కోసం ట్రయ్ చేస్తే మగవాళ్ళంతా రోడ్ల మీద తిరగాలి. అయినా నాకెందుకు ఉద్యోగం. మా ఇంట్లో సంబంధాలు చూస్తున్నారు. ఎవడో ఒక హీరోని పెళ్ళి చేసుకుని ఆ వీరుడితో కలిసి రోజుకో సినిమా చూస్తాను"

"అదృష్టవంతురాలివి"

"సర్లే. ఏమిటి నువ్వు అస్త్రసన్యాసం చేశావా?"

" అస్త్ర సన్యాసమా?"

"అవును. రావ్! నీ కథలు ఎక్కడా కనబడటం లేదు ఈ మధ్యన"

"ఓ కథల గురించా! ఉద్యోగాల వేటలో ఉన్నాను కదా. రాయటం లేదు"

"నీ పెళ్ళి ఎప్పుడు?" నవ్వుతూ అడిగింది.

"నీ కెందు కింత తొందర?"

"రచయితగారి భార్యని చూద్దామని"

"రచయిత భార్య ప్రత్యేకంగా ఉంటుందా?"

"అవును. నువ్వు నీ కథల్లో హీరోయిన్లని గంటలతరబడి వర్ణిస్తూ ఉంటావు కదా! అలాంటి హీరోయిన్నే చేసుకుంటావో, లేదో నని"

"కథ వేరు- జీవితంవేరు రాజామణి"

"నన్ను చేసుకో"

"వద్దులే. నిన్ను భరించలేను. నువ్వెక్కడ? వూహలు నువ్వు... ఆకాశంలో విహరిస్తూ ఉంటావు. నేను సామాన్యుడిని"

"పిరికివాడినని చెప్పలేవూ?"

"పోనీ. అలాగే అనుకో"

"పోనీ సుందరిని చేసుకుంటావా?"

"వద్దు. నేను మీ ఇద్దరినీ చేసుకోను- సుందరి నీకేమీ తీసిపోదు. ఇద్దరూ ఇద్దరే"

గబగబా నవ్వింది రాజామణి "పిరికి రచయిత" అన్నది.

వాచీ చూసుకున్నాడు వెంకోబరావు.

ఆ తరువాత "ఇక నే వెళతాను... పనుంది... మళ్ళీ కలుస్తాను" అని నిల్చున్నాడు.

"అప్పుడప్పుడు వస్తూవుండు రావ్. నీ రాక నాకు సంతోషాన్ని కలిగిస్తుంది. తప్పక వస్తావు కదూ" అన్నది బయటవరకూ వచ్చి.

తల వూపాడు వెంకోబరావు.

ఆ రాత్రి అతనికి నిద్ర పట్టలేదు. కళ్ళముందు సుందరి కదులుతోంది. నెల రోజుల క్రితమే సుందరి తండ్రికి వాల్తేరుకు ట్రాన్స్‌ఫర్ అయింది. వాళ్ళు వెళ్ళి పోయారు. సుందరిని అతను రాజామణి ఇంట్లోనే నాలుగైదుసార్లు కలిశాడు. ఒకసారి రచయితల గురించి, కథల గురించి వెంకోబరావుకి, సుందరికి చాలాసేపు వాదన జరిగింది. రచయితలంతా సాధారణంగా తెలివిగల వాళ్ళంటే సుందరి ఒప్పుకోలేదు. సుందరితో ఎక్కువసేపు మాట్లాడటం కోసమే ఆ విషయం గురించి వెంకోబరావు అంతసేపు వాదించాడు.

అతను ఆ రాత్రంతా సుందరికి, ఆ అద్దె పుస్తకాల షాపు కుర్రాడికి మధ్య జరగబోయే ప్రేమాయణం గురించే ఆలోచించాడు.

ఆ తరువాత మళ్ళీ పది రోజులకు వెంకోబరావు రాజామణి ఇంటికి వెళ్ళాడు. సుందరి నుంచి ఉత్తరం వచ్చి ఉంటుందనీ, అందులో ఆ అద్దె పుస్తకాల షాపు కుర్రాడి గురించి వివరాలు రాసి ఉంటుందనీ వెంకోబరావు ఉద్దేశం.

అతని ఆలోచన నిజమే అయ్యింది.

వెంకోబరావు వెళ్ళేసరికి రాజామణి, ఆమె తల్లి ముందు గదిలో కూర్చుని మాట్లాడుకుంటున్నారు.

అతనితో ఒక అయిదు నిముషాలు మాట్లాడిన తరవాత రాజామణి తల్లి అక్కడి నుంచి వెళ్ళిపోయింది.

"ఏమిటి విశేషాలు?" అడిగింది రాజామణి.

"ఏమున్నాయ్ మామూలే. మళ్ళీ నాలుగైదు ఉద్యోగాలకు అప్లై చేశాను. రెండు కథలు రాసి రెండు పత్రికలకు పంపించాను"

"ఏమిటా కథలు?"

"ఇప్పుడు చెప్పను. అచ్చయిత తరవాత చదువు"

"అబ్బో... అంతా సస్పెన్స్"

ఇంతలో రాజామణిని లోపల్నించి తల్లి పిలిచింది. లోపలకు వెళ్ళిందా అమ్మాయి.

అప్పటికే వెంకోబరావు టేబిల్ మీద రేడియో కింద నించి తొంగి చూస్తున్న ఇన్‌లాండ్ లెటర్‌ని చూశాడు. దానిమీద ఫ్రమ్ అడ్రసు సుందరి, వాల్తేరు అని ఉండటం కూడా గమనించాడు.

రాజామణి లోపలకు వెళ్ళగానే ఆ ఉత్తరాన్ని తీసి గబగబా చదవటం మొదలుపెట్టాడు.

"మైడియర్ రాజీ!

నేను క్షేమం. నీ ఉత్తరం అందింది. నా మనసేమీ బాగా లేదు. పోయిన సారి ఉత్తరంలో చాకులాంటి అద్దె పుస్తకాల షాపు కుర్రాడి గురించి రాశాను కదా! అతనంత సులభంగా నా హృదయంలోని ఆలోచనలను చదివే మనిషిలా కనిపించటంలేదు. పోనీ పిచ్చి వేషాలు వేద్దామంటే బావుండి చావదు. ఒక లవ్‌లెటర్ రాసి ఒక నవల్లో పెట్టి ఇద్దామంటే భయంగా ఉంది. ఎవరయినా అతని దృష్టిని నా మీదకు మళ్ళిస్తే ఎంత బావుండును అని పిస్తోందే, రాజీ! ఏం చెయ్యమంటావ్? నీలాంటి మంచి ఫ్రెండ్ నాకు ఇక్కడ ఎవ్వరూ లేరు. సరే... నువ్వేం చేస్తున్నావ్?"

ఆ తరవాత ఆ ఉత్తరాన్ని చదవలేదు వెంకోబరావు. కవరు మీద సుందరి ఎడ్రసును నోట్ చేసుకున్నాడు. లెటర్‌ను రేడియో క్రిందికి నెట్టేశాడు.

తరవాత గోడనున్న ఫోటోలను చూస్తూ కూర్చున్నాడు.

"ఏమిటీ ఆలోచిస్తున్నావ్?" చేతిలో టిఫిన్ ప్లేటుతో ప్రత్యక్షమయింది రాజామణి.

"ఏమీలేదు. నా ఉద్యోగం గురించి"

"అబ్బా... నువ్వు రచయితవి. తెలివైన వాడివి. నీకు రాకపోతే ఉద్యోగం ఎవరికి వస్తుంది. ముందు టిఫిన్ తిను"

అతని ఎదురుగా కూర్చుంది.

వెంకోబరావు ఆ చాకులాంటి కుర్రాడి గురించే ఆలోచిస్తున్నాడు. వాడు నిజంగా దురదృష్టవంతుడు. ఒక అందమైన అమ్మాయి వాడికోసం తపించి పోతున్నదని వాడికి తెలీదు. వాడు ఎంతటి గొప్ప అవకాశాన్ని తెలీకుండా జార విడుచుకుంటున్నాడు. తను వాడికి ఒక ఉత్తరం రాస్తే? ఏమని రాస్తాడు? ఎలా రాస్తాడు?

ఆపైన ఒక గంటసేపు కూర్చుని అక్కడినించి బయట పడ్డాడు వెంకోబరావు.

సరిగ్గా నాలుగురోజుల తరువాత వెంకోబరావు వూహించనిది ఒకటి జరిగింది.

ఎప్పుడో మూడు నెలల క్రితం వెంకోబరావు వాల్తేరులో ఒక ప్రయివేట్ కంపెనీలో

ఉద్యోగానికి అప్లై చేశాడు. వాళ్ళు అతన్ని ఒక నాలుగురోజుల్లో జరగబోయే ఇంటర్వ్యూకి రమ్మని లెటరు పంపారు.

అతనికి గొప్ప రిలీఫ్ కలిగినట్లనిపించింది.

తను సుందరి హృదయాన్ని దోచుకున్న ఆ కుర్రాడికి అసలు విషయం చెప్పవచ్చు.

కాని, తను వాల్తేరు వెళుతున్నట్లు వెంకోబరావు రాజామణికి చెప్పలేదు.

చెప్పకుండానే వాల్టేరు వెళ్ళి పోయాడు.

ఇంటర్వ్యూ అయిపోయేసరికి సాయంత్రం నాలుగు గంటలయ్యింది. అతను తను నోటు చేసుకున్న ఎడ్రసు ప్రకారం సులభంగానే సుందరి ఉంటున్న వీధిలోకి వచ్చాడు.

కాని, ఆ వీధిలో వెంకోబరావుకి ఎక్కడా నవలలను అద్దెకు ఇచ్చే బుక్‌షాపు కనిపించలేదు. ఆశ్చర్యపోయాడు.

అప్పుడే ఒక ఇంట్లో నుంచి బయటకు వచ్చిన ఒక పదహారేళ్ళ కుర్రాడిని అడిగాడు వెంకోబరావు.

"ఈ వీధిలో ఒక అద్దెకిచ్చే పుస్తకాల షాపు ఉండాలి. ఏమయ్యింది?"

"అద్దెకిచ్చే పుస్తకాల షాపా?" ఆశ్చర్యంగా అడిగాడతను.

"అవును. ఒక కుర్రాడు నడుపుతున్నాడు దాన్ని"

"అసలు ఈ వీధిలోనే కాదు... పక్క వీధిలో కూడా మీరు చెప్పే షాపు లేదు"

"పోనీ ఇంతకుముందు ఉన్నదా?"

"మేము ఈ వీధిలో మూడేళ్ళనుంచీ ఉంటున్నాము. అప్పటి నించి ఇప్పటివరకూ లేదు" చెప్పి వెళ్ళిపోయాడతను.

వెంకోబరావుకి మతి పోయింది.

ఇదేమిటి? అసలు బుక్‌షాపు లేకుండానే సుందరి తన స్నేహితురాలయిన రాజామణికి అలా ఎందుకు లెటర్లో రాసింది?

రాజామణి జెలసీగా ఫీలవ్వటానికా?

నిరుత్సాహంగా వెనక్కు మళ్ళాడు. వాల్టేరునుంచి వచ్చిన మూడు రోజుల తర్వాత వెంకోబరావు రాజామణి ఇంటికి వచ్చాడు అతడు వెళ్ళి కూర్చున్న ఐదు నిముషాలకు పోస్ట్‌మేన్ వచ్చి రాజామణికి ఒక ఉత్తరాన్ని ఇచ్చి వెళ్ళాడు.

ఆ ఉత్తరాన్ని చదివి అయిదు నిముషాల సేపు విరగబడి నవ్వింది రాజామణి. తర్వాత ఆ ఉత్తరాన్ని వెంకోబరావు మీదకు విసిరింది.

ఆత్రంగా ఆ ఉత్తరాన్ని చదివాడు అతను.

"ప్రియమైన రాజీ!

చివరకు మనము గెల్చాము. నీ రచయిత స్నేహితుడు వోడిపోయాడు. మనం అనుకుంటున్నట్లుగా అతను నిన్న మా వీధిలోకి వచ్చి ఆ బుక్‌షాపు గురించి ఎంక్వయిరీ చేసి నిరుత్సాహంతో వెళ్ళిపోయాడు. మన ప్లాను సక్సెస్ అయింది. ఇప్పటి కయినా ఆ వెంకోబరావుతో చెప్పు- రచయిత లందరూ తెలివిగలవాళ్ళు కాదని. ఉంటాను. బై- నీ సుందరి"

వెంకోబరావు తలెత్తలేక వోయాడు. రాజామణి ఇంకా నవ్వుతూనే ఉంది.

(25 -11-1981 ఆంధ్రప్రభ వారపత్రికలో ప్రచురితం)